భార్యకు తోడుగా భర్త పొదుపు

- పురుషుల పొదుపు సంఘాలకు శ్రీకారం
- డ్వాక్రా సంఘాల సభ్యుల భర్తలకు అవకాశం
- 18 నుంచి 59 ఏళ్ల లోపు వయస్సున్న వారు అర్హులు
- అమలుకు వంద రోజుల యాక్షన్ ప్లాన్
- 'వల్‌నరబుల్(దుర్బల) గ్రూప్' పేరుతో ఐదుగురు సభ్యులతో సంఘం
- ఆరు కేటగిరీల్లో అసంఘటిత రంగాల వారికి అవకాశం



పొదుపు సంఘం

తాడేపల్లిరూరల్: భార్యకు తోడు ఇక నుంచి భర్త పొదుపు చేదోడు కానుంది. మహిళల పొదుపు సంఘాల(డ్వాక్రా) తరహాలోనే.. పురుషుల పొదుపు సంఘాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో డ్వాక్రా సంఘాల్లోని మహిళల భర్తలను సభ్యులుగా తీసుకోనున్నారు. ప్రభుత్వం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఈ సంఘాల ఏర్పాటుకు కసరత్తు మొదలైంది. సమాజంలో ఆర్థికంగా తీవ్ర నిరాదరణకు గురైన భవన నిర్మాణ, గిగ్ తదితర రంగాల్లో కూలీలుగా పనిచేస్తున్న పురుషులను ఆదుకోవాలని ప్రభుత్వం భావించింది. 'వల్‌నరబుల్ గ్రూపు' పేరుతో ఇందుకు సంబంధించి వంద రోజుల యాక్షన్ ప్లాన్ రూపకల్పన చేసింది. మంగళగిరి నియోజకవర్గంలో ఇప్పటికే పదుల సంఖ్యలో పురుషుల పొదుపు సంఘాలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. ఈ ఏడాదిలోనే పురుషుల దుర్బల సంఘాలకు ఆర్థిక స్వావలంబన, సాధికారతకు కృషి చేయనున్నారు.

ఆరు కేటగిరీలు

పురుషుల పొదుపు సంఘాలను ఆరు కేటగిరీలుగా విభజించారు. 1. మొదటి కేటగిరి కింద తాపీపని చేసేవారు, ప్లంబర్లు, పెయింటర్స్, కార్పెంటర్లతో పాటు ఇతర బిల్డింగ్ వర్కర్లు ఏర్పాటు చేసుకోవచ్చు. 2. రెండవ కేటగిరి కింద వేస్ట్ లేదా శానిటరీ వర్కర్లు (శానిటేషన్ సిబ్బంది), 3. మూడవ కేటగిరికి కింద గిగ్ వర్కర్లు (స్విగ్గీ, జుమాటో, అమెజాన్ డెలివరీ బాయ్స్), 4. నాల్గవ కేటగిరి కింద కేర్ వర్కర్లు (చిన్ని పిల్లలను చూసేవారు, వయోవృద్ధులకు సేవ చేసేవారు), 5. ఐదవ కేటగిరి కింద డొమెస్టిక్ వర్కర్లు (ఏసీ, ఫ్రిజ్, గృహోపకరణాలు బాగు చేసేవారు, ప్రైవేటు ఎలక్ట్రీషియన్లు), 6. ఆరవ కేటగిరి కింద టాన్స్‌పోర్ట్ వర్కర్లు (కార్పొరేషన్, పంచాయతీల్లో డ్రైవర్లు) గ్రూపులుగా ఏర్పడవచ్చు.

మంగళగిరిలో రంగం సిద్ధం

మంగళగిరి నియోజకవర్గంలో పురుషుల పొదుపు సంఘాల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. (మెప్మా) ఆధ్వర్యంలో వంద రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేస్తోంది. సభ్యులకు 18 ఏళ్ల నుంచి 59 ఏళ్లలోపు ఉండాలి. ఒక్కో సంఘానికి ఐదుగురు చొప్పున ఎంపిక చేయనుంది. సమాజంలో సామాజికంగా, ఆర్థికంగా చికితికన, పేదరికంలో అట్టడుగున నిలిచిన భవన నిర్మాణ కార్మికులు, తాపీ వర్కర్లు, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, వాచ్ మెన్స్, హమాలీలు, టైల్స్, పేషెంట్ల దగ్గర పనిచేసేవాళ్లు, పిల్లలను చూసుకునేవాళ్లు, వృద్ధుల సంరక్షకులు, రజకులు, వ్యర్థాలు సేకరణ కూలీలు, గిగ్ వర్కర్లు, జొమాటో, స్విగ్గీ, ర్యాపిడో వర్కర్లకు ఎంపిక చేయాలని నిర్ణయించింది. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి మూడు నెలల నుంచి ఆరు నెలల పాటు ఎంపికకు డ్వాక్రా పొదుపు సంఘాల సభ్యుల బ్యాంకింగ్ లావాదేవీలను పరిశీలించనుంది. ఆయా గ్రూపుల క్రమం తప్పని చెల్లింపుల ఆధారంగా ఐదు నుంచి పది రెట్ల మేరకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించాలనే ఆలోచనలో ఉంది. మొదటి విడుత రుణాల చెల్లింపుల ఆధారంగా మలి విడత రుణాల మంజూరు లక్ష్యాన్ని మరింత పెంచడానికి గల అవకాశాలు ఉన్నాయని చెబుతోంది. మొదటి విడత అనంతరం డ్వాక్రా సంఘాల తరహాలో రుణాల లభ్యత ఉంటుందని ప్రభుత్వం చెబుతోంది.

పేదరికంలో మగ్గుతున్న కుటుంబాలకు బ్యాంకు రుణాల ద్వారా చేయూతను అందించి, ఉపశమనాన్ని ఈ పథకం కలిగిస్తుందనడంలో సందేహం లేదు.

రివాల్వింగ్ ఫండ్ రూ.25వేలు



ప్రభుత్వం 'వల్‌నరబుల్(దుర్బల) గ్రూప్' పేరుతో పురుషుల పొదుపు సంఘాలను ఏర్పాటు చేయనుంది. డ్వాక్రా సంఘాల్లోని మహిళల భర్తలు ఐదుగురు సభ్యులుగా ఒక్కో సంఘం ఏర్పాటు చేయనుంది. ఈ సంఘానికి రివాల్వింగ్ ఫండ్ కింద మొదట రూ.25 వేలు రుణం అందజేస్తుంది. అలాగే బ్యాంక్ లోన్ ద్వారా రూ.75 వేల నుండి లక్ష రూపాయల వరకు అందజేస్తారు. మహిళలు ఏ విధంగా రుణం తీరుస్తారో అదే విధంగా పురుషులు కూడా చెల్లించాలి. పురుషులను ఆరు కేటగిరీలుగా విభజించారు.

– ప్రభావతి, మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్, సీఎంఎం, మెప్మా

88వ రోజు ఏసీసీ కార్మికుల దీక్ష



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు శనివారం 88వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు ప్రారంభించి, మాట్లాడుతూ తమకు న్యాయంగా రావాల్సిన నష్ట పరిహారం కోసం కార్మికులు దీక్షలు చేస్తున్నారని అన్నారు. తమ తాతలకు ఏసీసీ యాజమాన్యం నష్ట పరిహారం ఇవ్వాలని మన వరాలు కూడా దీక్షలో పాల్గొనడం బాధాకరమన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి కార్మికుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు నారా లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, కె.ఆదినారాయణ, దేవరాజు, ఎం.ఆశీర్వాదం, సారమ్మ, రమాదేవి, ఇమాంబి, నాగమల్లేశ్వరి, దుర్గా భవాని, గురవయ్య, అగ్గయ్య పాల్గొన్నారు.

సీపీఐ సీనియర్ నేత మృతి

మంగళగిరి: నగర పరిధిలోని నూతక్కి గ్రామంలోని సీపీఐ సీనియర్ నాయకుడు భీమిరెడ్డి కుటుంబరెడ్డి(94) అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. ఆయన మృతికి నాయకులు చిన్ని తిరుపతయ్య, అన్నవరపు ప్రభాకర్, ముసునూరు సుహాస్, చిన్ని సత్యనారాయణ, జాలాది జాన్‌బాబు, షేక్ మదీనా, కల్లం మోహన్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు.

క్లుప్తంగా

జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



మంగళగిరి: నగర పరిధిలోని కాజ జెమ్స్ స్కూలులో శనివారం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఎగ్జిబిషన్లో రోబోటిక్స్ , పొల్యూషన్, పర్యావరణ పరిరక్షణ, చంద్రయాన్ ప్రాజక్టులను ప్రదర్శించారు. ప్రిన్సిపల్ డి.ప్రసన్న రాణి విద్యార్థులను అభినందించారు. నూతక్కి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ సందర్భంగా క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సర్ సీవీ రామన్ గురించి విద్యార్థులకు వివరించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

ప్రారంభమైన ఇంటర్మీడియెట్ పరీక్షలు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని మార్నింగ్ స్టార్ కళాశాల, రంజన్‌బాబు జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. మార్నింగ్ స్టార్ కళాశాల పరీక్ష కేంద్రంలో 164 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపల్ హరినాథ రెడ్డి తెలిపారు. రంజన్‌బాబు జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 151మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించినట్లు డాక్టర్ శ్వేత తెలిపారు.

పిల్లలే పనోళ్లు..



మంగళగిరి: నగర పరిధిలోని నిడమర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో పనులు చేయించారు. పాఠశాల ఆవరణను చీపుర్లతో ఊడిపించే పనిని ఉపాధ్యాయులే దగ్గరుండి చేయించడం విశేషం. ఇటీవల పట్టణంలోని సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్లో విద్యార్థులతో డాబా పైకి బల్లలు, కుర్చీలు మోపిస్తున్న వీడియో వైరల్‌కాగా, విద్యాశాఖ అధికారులు విచారణకు ఆదేశించారు. అయినా ఉపాధ్యాయుల్లో మార్పురావడం లేదు.

క్షయను పూర్తిగా నివారించొచ్చు



దుగ్గిరాల: దుగ్గిరాల మండలం చిలువూరులోని యూనియన్ బ్యాంక్‌లో ఏర్పాటుచేసిన క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న చిలువూరు యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ యోగేష్ కుమార్ మాట్లాడుతూ క్షయ వ్యాధిని పూర్తిగా నివారించవచ్చని చెప్పారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా పరీక్షలతో పాటు మందులు ఇస్తారని, క్షయ వ్యాధిగ్రస్తులకు కేంద్రం నెలకు రూ.1000 చొప్పున 6 నెలలకు రూ.6,000 రోగి బ్యాంకు ఖాతాలో జమ చేస్తుందని వివరించారు. తెనాలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ డాక్టర్ పల్లికొండ రవి కుమార్ మాట్లాడుతూ మార్చి 24న వరల్డ్ టీబీడే సందర్భంగా స్కూళ్లో, కాలేజీల్లో, పబ్లిక్ ప్రదేశాలలో, కమ్యూనిటీ ప్రదేశాలలో క్షయ వ్యాధిపై రాష్ట్ర , జిల్లా అధికారుల సూచన మేరకు అవగాహన కార్యక్రమాలు చేస్తున్నామని వెల్లడించారు.

దేవికారాణికి 'వారసత్వ దీప్తులు' పురస్కారం

తెనాలి: పట్టణానికి చెందిన కవయిత్రి, ప్రభుత్వ ఉపాధ్యాయిని కొలకలూరి దేవికారాణి 'వారసత్వ దీప్తులు' పురస్కారాన్ని అందుకున్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అక్షరయాన్, సీతాస్, అభిజ్ఞ భారత్ సంస్థల సంయుక్త నిర్వహణలో శనివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జాతీయ సాహిత్య సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సాహితీవేత్తలు, వారి వారసులకు సంబంధించిన 'వంశపారంపర్య దీప్తులు' సంకలనాన్ని వెలువరించారు. ఆయా సాహితీవేత్తల వారసులను 'వారసత్వ దీప్తులు' పేరుతో సత్కరించారు. ప్రఖ్యాత స్త్రీవాద కవయిత్రి కొలకలూరి స్వరూపరాణి కుమార్తెగా కవితా రచనలో రాణిస్తున్న దేవికారాణిని ఈ సత్కారాన్ని అందుకున్నారు. ఐఏఎస్ అధికారి, పూర్వ ఎన్నికల అధికారి చిట్ల పార్థసారథి, దీపికారెడ్డి, ముక్తేవి భారతి, రాణి నల్లమోతు, స్వప్న, రమాదేవి కులకర్ణి, వాణి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. దేవికారాణి రచించి ఆలపించిన 'స్త్రీ శక్తి' పాట ప్రశంసలను అందుకుంది.

పార్టీ విజయానికి ఐక్యతతో కష్టపడి పనిచేయాలి

వైఎస్సార్ సీపీ తాడికొండ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న వనమా బాల వజ్రబాబు

తాడికొండ: పార్టీ విజయానికి అందరూ ఐక్యతతో కష్టపడి పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు అన్నారు. సీనియర్ నాయకులు మల్లంపాటి రాఘవరెడ్డి అధ్యక్షతన శనివారం తాడికొండలో నిర్వహించిన నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. అందరి ఆమోదంతో త్వరలో గ్రామ, మండల, జిల్లా స్థాయి పదవుల భర్తీ ప్రక్రియ జరగనుందన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ అందులో తప్పక స్థానం లభిస్తుందన్నారు. గతంలో జరిగిన చిన్నపాటి విభేదాలను విడనాడి భవిష్యత్తులో పార్టీని బలోపేతంగా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో విజయ బావుటా ఎగరేసేందుకు అవసరమైన మేరకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లనున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలే పార్టీకి పునాదులు అని, వారిని విస్మరించేది లేదని, పార్టీ విజయానికి పాటుపడిన ప్రతి ఒక్కరికీ భవిష్యత్తులో తగిన ప్రాధాన్యత తప్పక ఉంటుందన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభంజనమైన విజయం సాధించడం ఖాయమన్నారు. సీనియర్ నాయకులు మల్లంపాటి రాఘవరెడ్డి, వంగా పోలారెడ్డి, వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి, ఎంపీటీసీ ధూళిపాళ్ల నాగేశ్వరరావు, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు షేక్ ఖాజా, పార్టీ మాజీ గ్రామ అధ్యక్షుడు షేక్ జుబేర్, బండారుపల్లి సర్పంచ్ ముప్పాళ్ల మనోహర్, ఆళ్ల చిన హనుమంతరావు, మాజీ సొసైటీ చైర్మన్ చుండు వెంకటరెడ్డి, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడాకారుల ప్రయోజనాలే ముఖ్యం

శాప్ చైర్మన్ రవినాయుడు



క్రీడాకారిణి యాసిన్‌తో మాట్లాడుతున్న శాప్ చైర్మన్ రవినాయుడు

తాడేపల్లిరూరల్ : క్రీడాకారుల ప్రయోజనాలే రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమని, వారి భవిష్యత్తే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు కృషి చేస్తున్నారని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ (శాప్) చైర్మన్ అనిమిని రవి నాయుడు అన్నారు. శనివారం జాతీయ క్రీడాకారిణి ఎస్.కె.యాసిన్ మంగళగిరి రూరల్ పరిధిలోని కొలనుకొండలో ఉన్న శాప్ క్యాంపు కార్యాలయంలో రవినాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. రవినాయుడు మాట్లాడుతూ యాసిన్‌కు ప్రభుత్వ సహకారం ఎప్పుడూ ఉంటుందని, భవిష్యత్తులో అత్యుత్తంగా రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. 38వ జాతీయ క్రీడాల్లో జిమ్నాస్టిక్స్‌లో భాగంగా ట్రామ్పోలిన్ వ్యక్తిగత విభాగంలో గోల్డ్ మెడల్ సాధించడం అభినందనీయమని అన్నారు. పోటీలలో పాల్గొనే క్రమంలో యూనివర్శిటీ అటెండెన్స్ విషయంలో ఎదురవుతున్న ఇబ్బందిని యాసిన్ శాప్ చైర్మన్ రవినాయుడుకు వివరించగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రతిభను తల్లిదండ్రులు ప్రోత్సహించాలి



నమూనాలను పరిశీలిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

తాడేపల్లిరూరల్ : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలోని అరవింద్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన అకడమిక్ డెమోకు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఈ డెమో వల్ల తమ పిల్లల్లో విద్యాభివృద్ధి ఏ స్థాయిలో ఉందో తల్లిదండ్రులు గ్రహించగలుగుతారని పేర్కొన్నారు. అనంతరం సెకండరీ తరగతుల విద్యార్థులకు నెలసరిలో తీసుకోవాల్సిన పౌష్టికాహారం, శరీరంలో వచ్చే మార్పులను వివరించారు. ప్రధానోపాధ్యాయురాలు అనూరాధ మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ, ప్రైమరీ విద్యార్థులకు అన్ని సబ్జెక్టులకు సంబంధించిన కృత్యాలను పజిల్స్, చార్టులు, ఆటల రూపంలో ఏర్పాటు చేశారని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథి విజయలక్ష్మికి చిన్నారులు చిత్రీకరించిన ఉడ్ పెయింటింగ్‌ను బహూకరించారు. పాఠశాల ప్రిన్సిపల్ ఇంద్రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు భేష్



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ మాధవిలత

తెనాలిటౌన్: సేవా దృక్పథంతో స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఆర్మీ లెఫ్టినెంట్ కల్నల్ జె.మహేష్ కొనియాడారు. కొలకలూరు గ్రామంలో డొనేట్ ఫర్ పూర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన వైద్యశిబిరాన్ని లెఫ్టినెంట్ కల్నల్ జె.మహేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. డాక్టర్ మాధవీలత వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. డాక్టర్ పూజిత మాట్లాడుతూ డొనేట్ ఫర్ పూర్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు ప్రభాకరరాజు జయంతి సందర్భంగా సేవ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని తెలిపారు. సంస్థ అధ్యక్షులు రాకేష్ మాట్లాడుతూ 2019లో ప్రారంభించిన సంస్థ ద్వారా ఇప్పటి వరకు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలియజేశారు. వైద్య శిబిరంలో అవసరమైన వారికి మందులతోపాటు కళ్ళజోళ్లు పంపిణీ చేశారు. తెల్లరేషన్ కార్డు ఉన్నవారికి ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ ఆదర్స్, అనుపమ్, రోహిత్, రాజ్‌కుమార్, వినయ్‌కుమార్, రవికిరణ్; వెంకటేశ్వరరావు, మురళీధర్ పాల్గొన్నారు.

చేతిరాత శిక్షణ



మంగళగిరి: అందమైన చేతి రాత ఎంతో ముఖ్యమని జాతీయ ఉత్తమ అవార్డు గ్రహీత వి.రామ్మోహనరావు తెలిపారు. నగర పరిధిలోని నూతక్కి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం పెద్దలకు, పిల్లలకు చేతి రాతపై శిక్షణ ఇచ్చారు. చేతిరాత బాగుంటే మార్కులు అధికంగా సాధించవచ్చునని, మంచి చేతిరాత వల్ల ఉపయోగాలను వివరించారు. వీజీఆర్ దయాబెటిస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ జి.వేణుగోపాలరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.రాజీవ్ రత్న, వై.రవి కుమార్ పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకా



ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు గ్రామంలో 57 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేసినట్లు పశువైద్యాధికారి పీర్ అహ్మద్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి సోకకుండా టీకా పనిచేస్తాయన్నారు. పశువులకు వ్యాధి సోకినట్లయితే పాల ఉత్పత్తి తగ్గుతుందని చెప్పారు. నోటి నుంచి ద్రవం రావడం, నోటిలో, గిట్టల మధ్యలో పుండ్లు రావడం, పాలు తగ్గిపోవడం వంటివి జరుగుతాయన్నారు. ఈ లక్షణాలు ఉన్న వెంటనే పశు వైద్యశాలలో సంప్రదించాలని కోరారు. వ్యాధి సోకకుండా ముందుగానే వ్యాధి నివారణ టీకాలు వేయడం వల్ల వ్యాధి సోకదని తెలిపారు.

విద్యార్థుల ప్రతిభ

మంగళగిరి: పట్టణంలోని టిప్పర్ల బజార్‌లో ఉన్న మున్సిపల్ హైస్కూలు విద్యార్థులు సైన్స్ డే సందర్భంగా నిర్వహించిన పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. శుక్రవారం గుంటూరు డీసీఈబీ హాల్‌లో నిర్వహించిన పోటీలలో మంగళగిరి టిప్పర్ల బజార్‌లోని మున్సిపల్ స్కూలు విద్యార్థి షేక్ జీక్ర వ్యాసరచన పోటీలలో ద్వితీయ బహుమతి సాధించింది. పఠాన్, జాస్మిన్ వక్తృత్వంలో ద్వితీయ బహుమతి సాధించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈవో సీవీ రేణుక విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి, ప్రధానోపాధ్యాయులు షేక్ దరియావలిని అభినందించారు.

ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధం కండి

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



నూతనంగా ఎన్నికైన నాయకులతో దొంతిరెడ్డి వేమారెడ్డి

మంగళగిరి టౌన్ : సమష్టిగా పనిచేసి, నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలపై పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉండాలని మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళగిరి ఆత్మకూరు బైపాస్‌రోడ్డులో ఉన్న పార్టీ కార్యాలయంలో ఇటీవల నూతనంగా నియమితులైన వారిని శనివారం ఆయన సత్కరించారు. దొంతిరెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలకు ఏ చిన్న సమస్య వచ్చినా స్పందించి సీనియర్ల సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. కూటమి నేతల అక్రమాలపై ఎప్పటిప్పుడు నిలదీయాలని సూచించారు. పదవులు పొందిన వారు తమకు ఇచ్చిన అవకాశాన్ని శక్తివంచన లేకుండా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా యాక్టివిటీ కార్యదర్శి మల్లవరపు సుధారాణి, మంగళగిరి నియోజకవర్గ ఆర్‌టీఐ విభాగ అధ్యక్షులు ఉండ్రు కల్యాణ్ కుమార్, నియోజకవర్గ ప్రచార విభాగ అధ్యక్షుడు దర్శి రమేష్‌బాబు, మున్సిపల్ విభాగ అధ్యక్షుడు సుబ్బారావు, సోషల్ మీడియా ఇన్‌చార్జి శరత్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ఇది ప్రజలను మోసగించే బడ్జెట్

వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త డీవీఆర్



మంగళగిరి టౌన్ : కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలను మోసగించే విధంగా ఉందని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. బడ్జెట్ పేదలకు పూర్తిగా వ్యతిరేకంగా ఉందని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలకు బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయించి, పేదలను మోసం చేశారని ఆరోపించారు. ఆడబిడ్డ నిధి ఊసే లేదని, మహిళలకు ఉచిత బస్సు పథకం అమలుకు నిధులు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. అమరావతి అభివృద్ధి పేరుతో రూ.31 వేల కోట్లు అప్పు చేస్తున్న ప్రభుత్వం, పేదల సంక్షేమ పథకాలకు సరైన నిధులు ఎందుకు కేటాయించడం లేదో సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బడ్జెట్‌లో పొందు పరిచిన లెక్కలకు, ప్రజలకు చెప్పే మాటలకు ఎక్కడా పొంతన లేదన్నారు. అమలు చేయలేని హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టే విధంగా ఈ బడ్జెట్ ఉందని వ్యాఖ్యానించారు. దశ దిశ లేని బడ్జెట్ అని, అంతా అభూత కల్పనే అని అన్నారు. ఆర్థిక మంత్రి కేశవ్ తన బడ్జెట్ ప్రసంగంలో కేవలం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించేందుకు, చంద్రబాబును, లోకేష్‌ను పొగడడానికే సరిపోయిందని అన్నారు. 9 నెలల పాలనలో ఒక్క రూపాయి కూడా సంక్షేమానికి ఖర్చు చేయని కూటమి సర్కార్ రూ.లక్ష కోట్లు అప్పు చేయడం అసలైన ఆర్థిక అరాచకమని విమర్శించారు. ఎన్నికలకు ముందు లెక్కకు మించిన హామీలు ఇచ్చిన కూటమి నేతలు ఇప్పుడు నిధులు కేటాయించలేక కల్లబొల్లి మాటలు చెప్పడం విడ్డూరమన్నారు.

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం



అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న చిలకా కిరణ్, సాపాటి కిరణ్ తదితరులు

తెనాలిఅర్బన్: ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో అసువులుబాసిన అమర వీరులను స్మరించుకోవాల్సిన అవసరం మాదిగ జాతిపై ఉందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు చిలకా కిరణ్ మాదిగ, టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు సాపాటి కిరణ్ పేర్కొన్నారు. మాదిగ అమరవీరుల సంస్మరణ దినం పురస్కరించుకుని చెంచుపేట ఇందిరా నగర్‌లోని డాక్టర్ బాబు జగజ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద శనివారం వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధనలో వారు ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు చెప్పారు. ఎస్సీ వర్గీకరణ ఫలాలు అందరికి అందిననాడే వారికి నిజమైన నివాళి అని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాలోని ముఖ్యమంత్రులు, ఎస్సీ వర్గీకరణ జరిగే విధంగా చర్యలు వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ నాయకులు బి.ప్రసాద్, ఎమ్మార్పీఎస్ నాయకులు తంగిరాల మరియదాసు, కొక్కిలిగడ్డ మనోజ్, పినపాటి రత్నరాజు, గాజులవర్తి సురేష్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డు ప్రత్యేక తగరతులు



దుగ్గిరాల: దుగ్గిరాల బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డ్ మేకర్ ల్యాబ్ ఆన్ వీల్స్ కార్యక్రమం జరిగింది. మార్చి ఒకటి నుంచి 31 తేదీ వరకు రోబోటిక్స్ ఎలా నేర్చుకోవాలి, సాంకేతిక పరిజ్ఞానం అవగాహన శిక్షణ తరగతులు ఒకటో తరగతి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్స్ వరకు ఉంటుందని తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు ట్రైనింగ్ సర్టిఫికెట్ అందజేస్తారని స్కిల్ అడ్వైజర్ ఆర్ కార్తిక్ తెలిపారు.